క్లుప్తంగా

రోడ్లపై వ్యాపారాలు చేయవద్దు

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: దుకాణ దారులు తమ వ్యాపారాలను రోడ్లపై చేస్తే ఊరుకోబోమని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న హెచ్చరించారు. పట్టణ పరిధిలోని 15,19,29 వార్డుల లో బుధవారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వాహణ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని కొందరు వ్యాపారులు దుకాణాల బయట వ్యాపారాలు చేస్తున్నారని ఆరోపించారు. దీనివల్ల ప్రజల రాకపోకలకు అవరోధం ఏర్పడుతుందన్నారు. తమ దుకాణాలలోనే వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు ఉన్నారు.

వేసవి దుక్కులపై రైతులు అవగాహన కలిగి ఉండాలి

ఏరువాక సెంటర్ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ వెంకటలక్ష్మి



తెనాలిటౌన్: వేసవి దుక్కులపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ఏరువాక కేంద్రం సీనియర్ సైంటిస్ట్ డా.వెంకటలక్ష్మి పేర్కొన్నారు. రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో బుధవారం బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు, ఏరువాక కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో వేసవి దుక్కులపై రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ముఖ్యఅతిథిగా ఏరువాక కేంద్రం సీనియర్ సైంటిస్ట్ డా.వెంకటలక్ష్మి పాల్గొని మాట్లాడారు. దుక్కి లోతుగా దున్నడం వల్ల భూమి గుల్ల బారి సారవంతంగా మారుతుందని తెలిపారు. తద్వారా మొలక శాతం పెరుగుతుందని రైతులకు వివరించారు. దుక్కిదున్నే విధానంపై రైతులకు ఏ విధంగా వివరించాలో విద్యార్థులకు సూచించారు.అనంతరం గ్రామంలో ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యస్ ఎస్ ఎస్ క్యాంపు ఇన్‌చార్జ్ డా.సువర్ణలత, డా.సంధ్యారాణి, రైతులు రోశయ్య, అప్పారావు, రామ్మోహనరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు



రేపల్లె రూరల్: స్వచ్ఛంద సేవా సంస్థలు నిస్వార్థంతో ప్రజలకు సేవలు అందిచేందుకు ముందుండటం అభినందనీయమని శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు అన్నారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ సెంటరులో పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. జనసంచారం అధికంగా ఉండే ప్రదేశంలో చలివేంద్రం ఏర్పాటు చేయటం గర్వించదగిన విషయమన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థలు ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించటం ద్వారా ప్రభుత్వానికి ఉపశమనం కలుగుతుందన్నారు. అనంతరం ప్రజలకు చలివేంద్రంలో ఏర్పాటు చేసిన పానకం పంపిణీ చేశారు. పారిశుధ్య పరిరక్షణలో తనదైన సేవలు అందిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావును సంఘ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో పట్టణ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు కాశేపల్లి ఈశ్వరరావు, సెక్రటరీ తడికమళ్ళ బాబు, వైస్ ప్రెసిడెంట్‌లు పొన్నూరు శ్రీనివాసరావు, తుమ్మలపల్లి శివ, కోశాధికారి తూనుగుంట్ల రాజేష్, సహ కోశాధికారి గుర్రం సురేష్, నాయకులు సుగ్గుల సుదర్శనరావు, మహేష్, హారిక తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారం

ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

వేమూరు: పబ్లిక్ గ్రీవెన్స్ ద్వారా ప్రజల సమస్యలు పరిష్కారం చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. నియోజకవర్గ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పబ్లిక్ గ్రీవెన్స్ ద్వారా ప్రజల సమస్యలు తప్పకుండా పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరింయారు. పబ్లిక్ గ్రీవెన్స్‌లో వివిధ శాఖల అధికారులు పాల్గొని సమస్యలు పరిష్కరిస్తారని ఆయన తెలిపారు. పార్టీ ఆదేశాల ప్రకారం పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ విజయబాబు, తహసీల్దారు సుశీల, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెప్పిందే రేటు - ఇవ్వకుంటే వేటు!

- తెనాలి ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయంలో ప్రవేటు వ్యక్తి హవా!
- ఆయన మాటను జవదాటని యంత్రాంగం!
- ఆగడాలకు అడ్డుకట్ట వేయాలంటూ పలువురు వినతి

తెనాలిరూరల్: స్థానిక ప్రాంతీయ రవాణాశాఖ అధికారి కార్యాలయంలో ఓ ప్రైవేటు వ్యక్తి రాజ్యమేలుతున్నాడు. అతను చెప్పినట్టే కార్యాలయం సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. అధికారులు సైతం ఇతని ఆగడాలకు కళ్లెం వేయలేకపోతున్నారు. ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయాల్లో పరిధి ఎక్కువ ఉన్న ఈ కార్యాలయంలో దశాబ్దంకు పైగా ఇతను షాడో అధికారిగా వ్యవహరిస్తున్నాడు. తెనాలి ప్రాంతీయ రవాణాశాఖ అధికారి కార్యాలయం పరిధిలో ఏడు మండలాలు ఉంటాయి. ఈ కార్యాలయంలో అధికారుల పనులు చక్కదిద్దేందుకంటూ బాపట్ల జిల్లాకు చెందిన వ్యక్తిని సుమారు 12 ఏళ్ల క్రితం అప్పటి అధికారుల ప్రతినిధిగా పెట్టుకున్నారు. ఏజెంట్లు, షోరూంలు, ట్రావెల్స్ వంటి వాటి నుంచి వసూళ్లు చేయడం, అధికారుల అవసరాలను తీర్చడం వంటివి చేస్తుండే వాడు. అప్పటి నుంచి అధికారులు మారినా ఇతను మాత్రం అదే హోదాలో పని చేస్తూనే ఉన్నాడు. లైసెన్సు, ఎల్ఎల్ఆర్, వాహనాల రిజిస్ట్రేషన్‌లు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌లు వంటి వాటిలో నిబంధనలకు విరుద్ధంగా అదనంగా డబ్బులు వసూలు చేసి అధికారులకు వాటాలు పంచడం చేస్తుంటాడు.

అధికారుల పేరు చెప్పి అక్రమ దందా..

ఏళ్ల తరబడి ఇదే కార్యాలయంలో తిష్ట వేసుకుని ఉండడంతో ఇతనూ ప్రభుత్వ ఉద్యోగి అయి ఉంటాడన్న భావన దరఖాస్తుదారుల్లో ఉంది. డ్రైవింగ్ లైసెన్సు, ఎల్ఎల్ఆర్ వంటి అవసరాలకు కార్యాలయానికి వెళ్లిన వారి దరఖాస్తు ఫారాలను ఇతనే పరిశీలించి అది లేదు, ఇది లేదు, ఈ జిరాక్స్ పనికిరాదు అంటూ అజమాయిషీ చేస్తుంటాడు. తనకు నచ్చిన (అడిగినంత ముట్టజెప్పిన)వారి ఫైలును వెంటనే అధికారుల వద్దకు వెళ్లేలా చేస్తాడు. నచ్చని వారి ఫైలు ముందుకు కదలకుండా అడ్డుపడుతుంటాడన్న ఆరోపణలూ ఉన్నాయి.

రద్దు చేసి వ్యవస్థ అయినా...!

లైసెన్సు ఏజెంట్లను ప్రభుత్వం గతంలోనే రద్దు చేసినా వారికి ప్రత్యామ్నాయ జీవనోపాధి లేకపోవడంతో ఇదే జీవనాధారంగా సుమారు 25 మంది అనధికారికంగా ఏజెంట్లుగా పని చేస్తున్నారు. వీరిపైనా సదరు బాపట్ల జిల్లా వ్యక్తిదే పెత్తనం. కార్యాలయంలో ఎవరి ఫైలు ముందుకెళ్లాలన్నా, ఎవరి ఫైలును ఆపాలన్నా అంతా తన ఇష్టం అన్నట్లు వ్యవహరిస్తున్నాడని కొందరు వాపోతున్నారు. ఇటీవల ఓ వ్యక్తి తన కుమార్తె ఎల్ఎల్ఆర్‌కు దరఖాస్తు చేసుకుని స్లాట్ బుక్ చేసుకున్న రోజున వెళ్లి, తాను మీడియాలో పని చేస్తున్నానని చెబితే 'అయితే ఏంటంటా.. లైన్‌లో ఆగాలంటూ' తలబిరుసుగా సమాధానమిచ్చాడు.

అసలు కార్యాలయ ఉద్యోగులు కానీ ప్రాంతీయ రవాణా అధికారి, మోటారు వాహన ఇన్‌స్పెక్టర్, సహాయ మోటారు వాహన ఇన్‌స్పెక్టర్ సైతం దరఖాస్తుదారులతో దురుసుగా మాట్లాడరు. గతంలో ఇతను పని చేసిన అధికారులు ఇప్పుడు ఉన్నత హోదాల్లో ఉండడం, వారి అండతో ప్రస్తుత అధికారుల వద్ద పనులు చక్కబెట్టుకుంటున్నాడని తెలుస్తోంది. ఏదేమైనా ఈ ప్రైవేటు వ్యక్తి వచ్చిన వారితో తానే అధికారినన్నట్లు వ్యవహరిస్తుండడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇదే విషయమై రవాణా శాఖ అధికారులను సంప్రదించగా ప్రైవేటు వ్యక్తుల జోక్యాన్ని సహించేదే లేదంటూ సమాధానమిచ్చారు. ఈ ప్రైవేటు వ్యక్తి నిర్వాకంపై జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలని పలువురు కోరుతున్నారు.



తెనాలి ప్రాంతీయ రవాణా శాఖ అధికారి కార్యాలయం

కిట్స్ వివరాలు నమోదు చేసుకోండి

జిల్లా కో-ఆర్డినేటర్ చక్రవర్తి



పాయింట్‌లను పరిశీలిస్తున్న చక్రవర్తి, నాగేంద్ర

తెనాలిఅర్బన్: విద్యార్థులకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న సర్వేపల్లి రాధకృష్ణ విద్యార్థి మిత్ర స్టూడెంట్ కిట్స్ వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవాలని కిట్స్ పర్యవేక్షణ జిల్లా కో-ఆర్డినేటర్ బెల్లంకొండ చక్రవర్తి, మన బడి-మన భవిష్యత్ కార్యక్రమ అసిస్టెంట్ ఇంజినీర్ సి.హెచ్. నాగేంద్రలు సూచించారు. తెనాలి చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్‌లోని స్టాక్ పాయింట్‌ను బుధవారం వారు పరిశీలించింది.

ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు, మూడుజతల ఏకరూప దుస్తులు,బూట్లు, బ్యాగ్ తదితర వస్తువులను జూన్ నాటికి అందించేందుకు చర్యలు తీసుకుంటుందని చెప్పారు. పంపిణీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వస్తువుల బధ్రతకు అవసరమైన సూచనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు మేకల లక్ష్మినారాయణ, వై జయంతి బాబు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దోపిడీ కేసులో మైనర్ సహా ఇద్దరి అరెస్ట్

వివరాలు వెల్లడించిన డీఎస్పీ జనార్ధనరావు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జనార్ధనరావు

తెనాలిరూరల్: ఆటో ప్రయాణికుడిని అటకాయించి సెల్‌ఫోన్, నగదు దోచుకున్న ఘటనలో మైనరు సహా ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక త్రీ టౌన్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ బి. జనార్ధనరావు వెల్లడించిన వివరాల ప్రకారం.. రూరల్ గ్రామం అంగలకుదురుకు చెందిన చుండి సుధాకర్‌రావు దివ్యాంగుడు.

గతంలో ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయంలో పని చేసి రిటైర్ అయ్యాడు. వ్యక్తిగత పనుల నిమిత్తం ఈనెల 5న రాత్రి కావలి వెళ్లేందుకు తెనాలి రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. అయితే వికలాంగుల కోటాలో రైల్వే కన్సెషన్ పాస్ మరిచిపోయిన నేపథ్యంలో ఆటో ఎక్కి తిరిగి ఇంటికి బయలుదేరాడు. ఆ సమయంలో ఆటోలో ఉన్న చినరావూరుతోటకు చెందిన మరో బాల నేరస్తుడు కలిసి ఆటోను మారిస్‌పేట ఎరువుల కొట్ల బజారులోకి తీసుకువెళ్లిన తర్వాత బాధితుడి జేబులో ఉన్న సెల్‌ఫోన్, నగదును లాక్కొని, అతనిని ఆటో నుంచి కిందికి నెట్టి పారిపోయారు. బాధితుడు ఈనెల 6న పోలీసులను ఆశ్రయించడంతో ఏఎస్ఐ మురళి కేసు నమోదు చేశారు.

వహాబ్ రోడ్ లో ఉన్న నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి నగదు, నేరానికి ఉపయోగించిన ఆటోను, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని కోర్టుకు హాజరు పరిచినట్లు డీఎస్పీ వెల్లడించారు. సమావేశంలో సీఐ ఎస్. రమేష్ బాబు, ఎస్ఐ ప్రకాశరావు సిబ్బంది పాల్గొన్నారు.

బట్టీపట్టే విధానానికి ముగింపు పలకండి

ఎంఈవో మేకల లక్ష్మీనారాయణ



నృత్యాలు చేస్తున్న చిన్నారులు

తెనాలిఅర్బన్: బట్టీపట్టే విధానాన్ని మాపి.. విద్యార్థులను సృజనాత్మకతవైపు నడిపించాలని మండల విద్యాధికారి మేకల లక్ష్మీనారాయణ సూచించారు. నెహ్రూనికేతన్ లిటిల్ వండర్స్ స్కూల్ ప్రథమ వార్షికోత్సవంలో భాగంగా చెంచుపేటలోని స్కూల్ ఆవరణలో రెండు రోజులుగా జరుగుతున్న వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు బుధవారంతో ముగిశాయి. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు విద్యార్థులకు విలువలు కూడా నేర్పించాల్సి న అవసరం ఉందన్నారు. స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం తమ స్కూల్‌లో టెక్‌బుక్‌తో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అగ్‌మెంటెడ్ రియాల్టీ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విద్యాబోధన చేయనున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతాకాంత్, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్ పీ జనార్ధనరావు, పక్కన సీఐ రమేష్‌బాబు, ఎస్ఐ ప్రకాశరావు

తెనాలిరూరల్: పట్టణంలో ముగ్గురు గంజాయి విక్రేతలను పోలీసులు అరెస్టు చేశారు. పట్టణ త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఎస్. రమేష్‌బాబు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ బి. జనార్ధనరావు వివరాలను వెల్లడించారు. స్థానిక మారిస్‌పేట రేపల్లె రైలు గేట్ల సమీపంలో కొందరు గంజాయి సేవిస్తూ, విక్రయిస్తున్నారన్న సమాచారంతో సీఐ రమేష్ బాబు సారథ్యంలో సిబ్బంది దాడి చేసి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో గోరంట్లకు చెందిన నందిపాటి రాజశేఖరరెడ్డి, పేరేచర్లకు చెందిన తమనంపల్లి అరుణ్ కుమార్, తెనాలి పట్టణంలోని చినరావూరుతోటకు చెందిన దాసరి ప్రకాష్ బాబు ఉన్నారు. వారి నుంచి రూ.45 వేలు విలువ కలిగిన 1.50 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులలో ఒకరైన రాజశేఖర్ రెడ్డి హైదరాబాద్ నాంపల్లిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి నుంచి గంజాయిని కొనుగోలు చేసి, స్నేహితుడైన అరుణ్‌కుమార్‌తో కలిసి తెనాలికి వచ్చి దాసరి ప్రకాష్‌బాబుని కలిశారు. ముగ్గురు గంజాయి సేవిస్తూ, దాని విక్రయంపై చర్చిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. నిందితుల్ని అదుపులోకి తీసుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ రమేష్ బాబు, ఎస్ఐ ప్రకాశ రావు, కానిస్టేబుళ్లు పి. మురళి, కె. బాబురావు, ఎస్. జయకర్, ఎన్. శ్రీనివాసరావులను ఎస్పీ సతీష్ కుమార్ అభినందించినట్లు డీఎస్పీ వెల్లడించారు.

తెనాలిలో రేషన్ బియ్యం పట్టివేత

తెనాలిరూరల్: తెనాలిలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద రేషన్ బియ్యాన్ని వాహనంలో తరలిస్తున్నారన్న సమాచారంతో త్రీ టౌన్ పోలీసులు బుధవారం రాత్రి ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఓ వాహనంలో 50 బస్తాలు ఉన్నట్లు గుర్తించారు. వాటిలో 25 బస్తాల బియ్యం, 25 బస్తాల నూకలు ఉన్నట్టు చెబుతున్నారు. వాహనాన్ని, బస్తాలను స్వాధీన పరుచుకున్నారు. పొన్నూరుకు తరలిస్తున్నట్టు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. తరలిస్తున్న వ్యక్తి పరారీలో ఉన్నాడు. పోలీసులు రెవిన్యూ అధికారులకు సమాచారమిచ్చి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి పన్ను వంద శాతం వసూలు చేయాలి

డీఎల్‌పీఓ స్వరూపరాణి



మా కార్యదర్శులను సత్కరిస్తున్న డీఎల్‌పీఓ స్వరూపరాణి

కొల్లిపర: ప్రతి పంచాయతీలోని కార్యదర్శులు ఇంటి పన్నులు వసూలు విషయంలో తప్పకుండా వంద కు వంద శాతం పూర్తి చేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి కోట స్వరూపరాణి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు ఇంటి పన్నులు వసూలు విషయంపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మార్చి 31లోపల వందకు వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేసిన పంచాయతీ కార్యదర్శులను ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 20గ్రామ పంచాయతీలకు గాను 8పంచాయతీలలో మాత్రమే వందకు వంద శాతం పన్నులు వసూలు చేసి ఎటువంటి అవతవకులు లేకుండా ఖాజానాకు చెల్లించటం జరిగిందన్నారు.అదే విధంగా మిగిలిన అన్ని గ్రామాలల్లోని కార్యదర్శులు కూడా కృషి చేయాలని కోరారు. గ్రామాలలోని చెత్త సంపద కేంద్రాలను పూర్తిగా వినియోగించుకొని సంపద సృష్టించాలని, వేసవి కాలంలో మంచి నీటి చేతి పంపులు ఎటువంటి రిపేర్లు లేకుండా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవ రెడ్డి, ఎంపీడీవో వి.విజయలక్ష్మి, ఈవోపిర్డీ బార్గవ్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు కుదేలవుతున్నా పట్టించుకోని పాలకులు

అన్నదాతలతో కలిసి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి



జొన్న కల్లం వద్ద రైతులతో శివసాంబిరెడ్డి

తెనాలి: జొన్న పంటకు మార్కెట్‌లో ధర లేదు.. కొనుగోలు కేంద్రాలు తెరవలేదు.. పైగా అకాలవర్షాలకు రైతులు కుదేలవుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవటం దుర్మార్గమని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి వ్యాఖ్యానించారు. రూరల్ మండల గ్రామం నేలపాడులో బుధవారం ఆయన జొన్న రైతులను కలిసి వారి కష్టసుఖాలను విచారించారు. కొల్లిపర మండలం చక్రాయపాలెంకు చెందిన రైతు రెడ్రొతు మహేశ్వరరావు మాట్లాడుతూ రూ.26 వేలు నగదు కౌలుకు 15 ఎకరాలు తీసుకుని పంటల సాగు చేస్తున్నట్టు చెప్పారు. ఖరీఫ్‌లో వరికి, రబీలో జొన్నకు కలిపి ఒక్కో ఎకరాకు రూ.50 వేలు పెట్టుబడి పెట్టారు. ఖరీఫ్లో ధాన్యం 76 కిలోల బస్తా రూ.1740లకు అమ్ముకోవాల్సి వుండగా, వర్షాల కారణంగా కేవలం రూ.1400లకే అమ్ముకున్నట్టు చెప్పారు. మళ్లీ ఇప్పుడు అకాలవర్షాలతో జొన్న పంటకు నల్లకాటుక పేరుతో దళారులు బస్తాకు రూ.800 తగ్గించి కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయలేదని ఆవేదన పడ్డారు. తెనాలి నాజరుపేట రైతు గంపల గంగరాజు మాట్లాడుతూ నాలుగెకరాల సొంత భూమితోపాటు పదెకరాలు కౌలుకు చేసుకుంటున్నట్టు చెప్పారు. ప్రభుత్వం ఆదుకోకపోతే నిల్వ చేసుకునే వీల్లేదనీ, దళారులు అడిగిన రేటుకే అమ్మాల్సి వస్తుందన్నారు. అలాగే రైతులు బిల్లా కిషోర్, జల్లి నానీ మాట్లాడుతూ ఎకరాకు రూ.20 వేల నష్టం వస్తోందని చెప్పారు. అనంతరం విలేకరులతో సాంబిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను తెరిచి, అన్నదాతలను ఆదుకుంటుందో? లేక దళారులకు ఉపయోగపడుతుందో? తేల్చుకోవాలని కోరారు.

స్టాక్ పాయింట్ల గదులు తనిఖీ

కొల్లిపర: ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం రానున్న విద్యాసవత్సరంలోని విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకం ద్వారా విద్యార్థులకు అందిస్తున్న పాఠ్య పుస్తకాలు, బూట్లు, ఏకరూప దుస్తులు వంటి కిట్లను భద్రపరుచుటకు ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్ల గదులను బుధవారం జిల్లా సమగ్ర శిక్షా కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ దార్ల అనీల్ మండల విద్యాశాఖాధికారులు జి.సాల్మాన్‌రాజు , కె.ఝాన్సీలతో కలసి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు.

స్టాక్ పాయింట్ వద్ద ఉన్న సిబ్బందిని ఇప్పటి వరకు ప్రస్తుతం ఎంత మంది విద్యార్థులు ఉన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో విద్యార్థులు పెరిగే అవకాశాలు ఉన్నాయా లేవా, గదుల భద్రత వంటి విషయాలను అడిగి తెలుసుకుని రికార్డులను, కిట్లను భద్రపరిచే గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అందించాల్సిన వస్తువుల భద్రత, కిట్ల పంపిణీ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.వెంకట్రావు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ ఎస్. రమేష్, సీఆర్ఎంటీఎస్ పి.రమేష్‌బాబు, వి.మురళి, బి.అనేఖ్య, వై.రాంబాబు, ప్రధమ టీం జిల్లా కో ఆర్డినేటర్ బి.చక్రవర్తి, మనబడి-మన భవిష్యత్తు అసిస్టెంట్ ఇంజనీరు సిహెచ్.నాగేంద్ర పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కొల్లూరు: రెవెన్యు కార్యాలయానికి వివిధ పనులపై వచ్చే లబ్ధిదారులు వేసవిలో మంచినీటికి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు కొల్లూరు తహసీల్దారు బి.వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం స్థానిక రెవెన్యు కార్యాలయంలో ఆయన చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవిలో కార్యాలయానికి వచ్చే ప్రజలకు మంచినీటిని సరఫరా చేయనున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు.



ఆటో నుంచి పడి మహిళకు గాయాలు



చందోలు(కర్లపాలెం): ఆటోలో ప్రయాణం చేస్తున్న ఓ మహిళ జారి రోడ్డుపై పడి గాయాలవటంతో చందోలు ఎస్ఐ స్పందించి ఆమెను వైద్యశాలకు తరలించిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. చందోలు పోలీసులు తెలిపిన వివరాల మేరకు అమర్తలూరు గ్రామం నుంచి ఖాజీపాలెం ఫంక్షన్‌కు వచ్చిన కంచర్ల శ్రావణి తిరిగి అమర్తలూరు ఆటోలో వెళుతుండగా చందోలులో ఆటో నుంచి జారి జాతీయ రహదారిపై పడటంతో తలకు బలమైన గాయాలయ్యాయి. విషయం తెలిసిన చందోలు ఎస్ఐ ఎం.వెంకట శివకుమార్ ఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రురాలిని 108 వాహనం ద్వారా బాపట్ల ఏరియా వైద్యశాలకు పంపారు.

నేడు కొలకలూరులో ఉచిత దంతవైద్య శిబిరం

తెనాలి టౌన్: రూరల్ మండలం కొలకలూరు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం, బాపట్ల వ్యవసాయ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో గ్రామస్తుల సేవార్థం ఉదయం 10 గంటలకు సిబార్ డెంటల్ కళాశాల వైద్య బృందం ఉచిత దంత వైద్యసేవలు అందిస్తారని ఎన్ ఎస్ ఎస్ క్యాంపు ఇన్‌చార్జి డా.సువర్ణలత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.గ్రామస్తులు పాల్గొని ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తెనాలి టౌన్: 33/11 కె.వి. అంగలకుదురు సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి కోపల్లె, గుడివాడ ఫీడర్ మరమ్మతులు గురువారం ఉదయం చేపట్టనున్నట్టు విద్యుత్ రూరల్ ఏఇ తోటకూర వీర వెంకటరావ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కోపల్లె గ్రామం పట్టణ యడ్ల లింగయ్య కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. చెట్ల తొలగింపు, లైన్లు సరిచేయడం వంటి పనులు చేపడతామని తెలిపారు.

వృద్ధులకు అన్నదానం

తెనాలి టౌన్: సేవా నిరతితో మానవజన్మ చరితార్థమవుతుందని శ్రీవేంకటేశ్వర యోగా సేవా కేంద్రం కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య పేర్కొన్నారు. స్థానిక నాజరుపేటలోని మన ఇల్లు వృద్ధాశ్రమంలో బుధవారం వృద్ధులకు సేవా కార్యక్రమం చేపట్టారు. యోగా కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య పాల్గొని వృద్ధులకు అన్నదానం,"పండ్లు పంపిణీ చేశారు. యోగా సభ్యులు తలారి నరసింహులు జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యుల సహకారంతో సేవా కార్యక్రమం నిర్వహించినట్టు రమణయ్య తెలియజేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు మురళీ పాల్గొన్నారు.

వలసలు నివారించాలి



కర్లపాలెం: గ్రామాలలో ప్రజలు పనుల కోసం వలసలు పోకుండా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు కల్పించాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లపై ఉన్నదని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. కర్లపాలెంలో లంక కాలువ సమీపంలో బుధవారం జరిగిన ఉపాధి హామీ పనులను ఎంపీడీవో శ్రీనివాసరావు పరిశీలించారు. కూలీల హాజరు పరిశీలించి పనులు నాణ్యతగా చేయాలని అన్నారు. ఉపాధి హామీ పథకంలో పనులు చేసే కూలీలకు రోజువారీ వేతనం రూ.307 వచ్చే విధంగా కొలతల ప్రకారం పనులు చేయించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు చెప్పారు. ప్రతి కూలీ 15 అడుగుల పొడవు, 5 అడుగుల వెడల్పు, అడుగు లోతు కొలతలతో బోది కాలువలు తవ్వాలని సూచించారు. వేసవికాలం కావటం వలన కూలీలు ఉదయాన్నే పనులు పూర్తి చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ రాంబాబు, కూలీలు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వం చేయూత

అమర్తలూరు(వేమూరు): రైతులు ప్రకృతి వ్యవసాయ సాగు చేస్తే ప్రభుత్వం చేయూత అందిస్తుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ అధికారి వి.నాగశ్రీ అన్నారు. అమర్తలూరు మండలంలోని ప్యాపర్రు రైతు సేవా కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ న్యాచురల్ ఫార్మింగ్ ప్రణాళిక గురించి మండల స్థాయి శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. న్యాచురల్ ఫార్మింగ్ కింద పని చేయుచున్న సీఆర్‌పీడబ్ల్యూ, ఐసీఆర్‌పీలకు, వ్యవసాయ శాఖ సహాయకులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేసే రైతులను గుర్తించి వారికి సహాయ సహకారాలు అందిస్తూ వారితో పాటు కొత్తగా ప్రకృతి వ్యవసాయం చేయుటకు రైతులను ప్రోత్సహించాలని ఆమె సిబ్బందికి సూచించారు.

మండల సమాఖ్య, గ్రామ సమాఖ్యల ద్వారా ఎక్కువ మంది రైతులకు ప్రకృతి వ్యవసాయం చేయుటకు బ్యాంక్‌ల ద్వారా ఆర్థిక సహాయం చేయగలమన్నారు. మండల వ్యవసాయాధికారి ఉయ్యూరి లోకేశ్వరి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయు రైతులను ఈ పంట నమోదు చేయటం ద్వారా గుర్తించి వారికి సరైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించుటకు వ్యవసాయ సహాయకులు కృషి చేయాలని ఆమె తెలిపారు.